# రెండో పాదం

ఏదన్నా అడిగితే కాస్త విమర్శగా చెబుతానని నన్ను చూస్తే మా రాఘవుడికి గురి. వాడో రోజున నన్ను బీచికి తీసుకుపోయి, కొంత కాలంగా వాణ్ని బాధిస్తున్న సమస్యను గురించి నా దగ్గిర ప్రస్తావన తెచ్చాడు.

"ఒరే అబ్బాయి, నాకు పెళ్ళి కాదని ఒక బెంగ పట్టుకుందిరా!" అన్నాడు రాఘవుడు. కారణమడిగాను.

"నాకిప్పుడు ఇరవైనాలుగో ఏడు. నాకు పదహారో ఏటే పెళ్ళి చెయ్యాలని మా వాళ్ళు సంబంధాలూ అవీ అట్టే చూశారు. కాని నేను చేసుకోనంటే చేసుకోనన్నాను. పెళ్ళయితే చదువు సాగదనీ సంసార భారం మీద పడ్డవాడు చిత్తేననీ మనవాళ్ళంటూ ఉంటారు చూడూ, ఆ మాటలన్నీ విని నాకు పెళ్ళంటే భయమేసింది. చెప్పొద్దూ! అందుకు అప్పట్లో పెళ్ళి ఎగ్గొట్టాను. బ్రహ్మచారి ముదిరినా బెండకాయ ముదిరినా ఎందుకూ పనికిరాదని మా అమ్మ అప్పుడే అంటూ వచ్చింది. అదిమటుకు నిజమైనట్టు కనిపిస్తున్నది" అన్నాడు రాఘవుడు.

"నీకేమీ భయమక్కర్లేదు. నీకేమీ వయస్సు మించిపోలేదు. ఇప్పుడు యీడేరిన పిల్లలు... కాలేజీల్లో చదువుకుంటున్నవాళ్లు బోలెడుమంది దొరుకుతారు" అన్నాను.

"అక్కడే వచ్చింది చిక్కు."

"ఎందువల్ల?"

ఇప్పుడు నాకు దొరికే మచ్చువాళ్ళని రోజూ బస్సుల్లోనూ, ట్రాముల్లోనూ, వీధి వెంటనా, బీచిలోనూ చూస్తున్నాను. కాని వాళ్ళల్లో నాకు భార్య కాదగినది, నా భార్య అయి నన్ను సుఖపెట్ట గలుగుతుందనిపించేది... ఒక్కతె కూడా కనబడదు. కొందరు చాలా అందంగా కూడా ఉంటారు కాని, వాళ్లు నన్ను గురించి ఆలోచించేటందుకన్నా సిద్ధంగా ఉన్నట్లుండరు. నువ్వే ప్రపంచం అనుకోని ఆడది, నీకు భార్య అయి నిన్నేం సుఖపెడుతుంది చెప్పు!"

నేను రాఘవుడి రోగ నిర్ణయం చెయ్యకమునుపు మరొక ప్రశ్న వేశాను. "నీకు చిన్నప్పుడే వివాహం అయివుంటే ఈ ఇబ్బంది లేకపొయ్యేదనిపిస్తున్నదా?"

"అనిపించడంలేదు. అటువంటి పెళ్ళి చేతికి సంకెళ్ళేగా. అది అనుకూల దాంపత్యం అయినా కాకపోయినా సహించవలసిందేగా?"

"అయితే, అబ్బీ, నువ్వు రెండో పాదంలో వున్నావు!" అన్నాను.

రాఘవుడు నా వంక వింతగా చూసి "రెండో పాదం?" అన్నాడు.

"కాస్త శ్రద్ధగా విను చెబుతాను. సంస్కారానికి చెందిన ప్రతి పరిణామానికి నాలుగు దశలు. మొదటి దశలో సదుద్దేశాలూ, విచిత్ర భావమూ, ఉన్నతాదర్శాలూనూ; రెండో దశలో, కళ్ళారా ధన, సౌందర్య పిపాసా, శిల్పమూ వ్యక్తిత్వమూనూ; మూడో దశలో ప్రయోజనమూ, ప్రచారమూ, ఆర్థిక దృష్టినీ; నాలుగో దశలో నిర్లిప్తతా, విమర్శనా దృష్టీ, వేదాంత వైఖరీ, విప్లవమూనూ. ఏ విషయంలో గాని నీకో సమస్య తగిలితే ఆ విషయంలో నీ సంస్కారం ఏ పాదంలో నడుస్తున్నదో తెలుసుకోవాలి. మాట వరసకు సాహిత్యం తీసుకో. ఇప్పటి భావ కవులను తీసుకో-"

"అబ్బ! భావ కవులను పోనిస్తూ!"

"అమ్మా! భావ కవులంత సులభంగా పోరు. వాళ్ళూ రెండో పాదంవాళ్ళే. ఇప్పటి కుర్రకారు సాహిత్యాన్ని మూడో పాదానికి చేరబట్టటానికి చూస్తున్నారు. దీని రహస్యం రెండో పాదం వాళ్ళకు చచ్చినా అర్థం కాదు. సినిమా తీసుకో-"

"పోనీరా! దాందుంప తెగిరా సినిమా!"

"సరే, నీ యిష్టం.... నీ పెళ్ళి విషయమే తీసుకో. మా వంటివాళ్ళు పెళ్ళి విషయంలో మొదటి పాదం వాళ్ళం. మాకు పెళ్ళి ఒక పవిత్రమైన విషయంగా వెళ్ళిపోయింది. అక్కడ మా వ్యక్తిత్వం ఆట్టే ప్రధానం కాలేదు. దాంపత్యంలో ఒక శిల్పమూ, ఒక సౌందర్యమూ ఉండాలనే విశ్వాసం మాకు కలగలేదు. మొదటి పాదపు సంస్కారంలో స్వీకరించిన భార్యలతో మేమేదో విధంగా కాలక్షేపం చేస్తున్నాం. నువ్విప్పుడు రెండో పాదంలో పడ్డావు. అదే నీ సమస్య" అన్నాను.

"నాకేమీ అర్థం కాలేదు. నాకెందుకు సమస్య కలగాలి? మీకెందుక్కలగలేదు?"

"సంఘం స్థూలంగా మొదటి పాదానికి సంబంధించిన సంస్కారం పెళ్ళిని గురించి ఆలోచిస్తున్నది. కాని ఇప్పుడిప్పుడు నీరకం రెండోపాదపు సంస్కారం కూడా ఇటువంటి పట్టణాల్లో తల ఎత్తుతున్నది."

"నన్నింతకూ ఏం చెయ్యమన్నావు? త్వరలో నాకు పెళ్ళవుతుందని నమ్మకం చిక్కకపోతే నేనే పిచ్చెత్తిపోతాను" అని రాఘవుడు నన్ను బెదిరించాడు.

"నువు చెయ్యగలిగింది ఒక్కటే వుంది. నీకు వివాహయోగ్యమైన అమ్మాయిలు తటస్థపడినప్పుడు, వాళ్ళ పరిచయం కష్టపడి సంపాదించి తద్వారా వాళ్ళలో ఎవరన్నా

నీకు సరిపడే మనిషి ఉందేమో చూసుకో. నీ గురికి కాస్త బెత్తెడులోకి వచ్చేదాన్ని చూసుకుని, దానిమీద నీ శక్తి యావత్తూ కేంద్రీకరించి, అది నీ భార్య కావటానికి వీలయే మార్గం చూసుకో."

రాఘవుడు తల అడ్డంగా ఆడించి, "సలహా అయితే బాగానే ఉంది. కాని ఆచరణలో పెట్టటం అంత సులభంగా కనపట్టంలేదు" అన్నాడు.

"నీకు పెళ్ళి దిగులు తగు మాత్రం ఉంటే అదే సాధ్యమవుతుంది" అని సలహా చెప్పాను.

తరవాత నెల్లాళ్ళకేమో రాఘవుడు కనిపించి మంచి సలహా చెప్పినందుకు నన్నభినందించాడు.

"ఏమిటి కథ?ఎవత్తె అయినా కనిపించిందా?" అన్నాను.

"కనిపించింది. నేనీమధ్య ఇల్లు మార్చాలే. ఆ మార్చటంలో ఇప్పుడు ప్రవేశించిన ఇంట్లో మా పక్క భాగంలో ఒక కుటుంబం అద్దెకుంటున్నారు. ఆయన కూతురు – పాపం చిన్నప్పుడే భర్త పోయినాట్ట! – సేవాసదనంలో చదువుతున్నది. పేరు విశాలాక్షి. కాస్త చిన్న కళ్ళయినా మనిషి అందంగానూ, ఆరోగ్యంగానూ ఉంటుంది. చాలా మంచిది కూడానూ. మొదట్లో పలకరించటానికి భయపడ్డాను. గాని, తీరా పలకరిస్తే బాగానే మాట్లాడింది. తల్లి తాలూకు ఆస్తి చాలా ఉందిట."

"ఇంకేం? మరీ మంచిదీ!" అన్నాను.

రాఘవుడికీ మాట కష్టం కలిగించినట్లు కనపడ్డది.

"నువ్వట్లా అంటున్నావు గాని ఆ దిక్కుమాలిన ఆస్తి నాకెంత ప్రతి బంధకంగా ఉందో నీకేం తెలుసు? అంత ఆస్తి ఉన్నదాన్ని పెళ్ళి చేసుకోమని ఎట్లా అడగను? అడిగితే నాకు తనమీదే ప్రేమ ఉన్నదని ఎట్లా నమ్ముతుంది? ఇదెంత చిక్కో ఆలోచించు," అన్నాడు వాడు.

"నీ బుర్రతో ఆలోచిస్తే పెద్ద చిక్కే."

"కాని నేను విశాలాక్షిని నమ్మిస్తానని నాకు ధైర్యం ఉన్నది."

"అబ్బా! నన్నడిగితే నువ్వా విషయం ఆట్టే విచారించవలసిన పనే లేదంటాను. రేపా పిల్ల ఇంకో భర్త కోసం వెతికేటప్పుడు కూడా తన ఆస్తి ఆశపెట్టి కాస్త మంచివాణ్ణి తెచ్చుకోవాలని చూడదంటావా?"

"నే నదే కూడదని గట్టిగా చెబుతున్నాను."

"ఆపిల్లతోనే?"

"కాదు. పిల్ల తండ్రితో. ఆయన అప్పుడప్పుడూ నాతో, 'మా పిల్లకు మంచి సంబంధం

ఉంటే చూడు, పంతులూ,' అంటాడు. 'ఇంత ఈడు వచ్చి ఇప్పటి కాలపు చదువు చదివే పిల్లను ఎరగనివాణ్ణి తెచ్చి కడతారుటండీ? ఎరిగిన వాళ్ళలోనే విశాలాక్షికి మంచి మొగుడయేవాణ్ణి చూసి చేసెయ్యండి' అని సలహా ఇస్తాను."

"ఆయన నీ సలహా వినే ధోరణిలో ఉన్నాడా?"

"ఆయన దేముందిలే? అంతా విశాలాక్షి మీద ఉంది."

"నా కాడవాళ్ళ సంగతి చెప్పకు. ఆడవాళ్ళు సంస్కారం విషయంలో ఏ పాదంలో ఉన్నదీ మనకు చచ్చినా తెలీదు."

"విశాలాక్షి అటువంటిది కాదు. చదువుకుంటున్నది. అనేక విషయాలను గురించి నీవూ నేనూ ఆలోచించినట్టు ఆలోచించగలదు."

"అదేమో నీకే తెలియాలి."

"ఇంకా విశాలాక్షి తండ్రే ఏ పాదంలోనూ లేనివాడు!"

"అట్లా అనకు. ఆయన మూడో పాదంలో ఉన్నట్టు నాకు సందేహంగా ఉంది."

"అంటే?"

"అంటే ఏంటో నువ్వే ఆలోచించుకో."

మళ్ళా రెండు మూడు నెల్లదాకా నాకు రాఘవుడు తటస్థపళ్ళేదు. కేవలమూ ప్రమాదవశాన వాడూ నేనూ బస్సులో కలుసుకున్నప్పుడు "ఏంరా, రాఘవా, ఏమిటి కబుర్లు?" అన్నాను. రాఘవుడు మొహం చిట్లించి, "ఏమీ లేవు" అన్నాడు.

ఏదో ఉందని నాకు వెంటనే అర్థమయింది. వాణ్ణి అటునించి అటే బీచిదారి పట్టించి ఇసకలో కూచోబెట్టి విషయం బయటికి లాగాను.

వాడికీ, విశాలాక్షికీ చెడింది. ఎబ్బే, పోట్లాట ఏమీ లేదు. వాడే ఆ పిల్లతో మాట్లాట్టం మానేశాడు. కారణమా? ఓ రోజు, రాఘవుడు ఇంట్లో ఉండగానే, ఎవడో విశాలాక్షిని చేసుకుంటామని వచ్చాడు.

ముప్ఫై దాటినవాడు చూడటానికి దిప్పిపిడతల్లే ఉన్నాడని మా రాఘవుడు వర్ణించాడు. అయితే అట్టహాసంగా సిల్కు సూటూ అదీ వేసుకున్నాడు. నూరు రూపాయల ఉద్యోగం చేస్తున్నాడు. ఎక్కడో చీరాలలో ఒక ఇల్లున్నదిట గాని ఆస్తి ఏమీ లేదు.

"ఆ సంబంధాన్ని విశాలాక్షి తిప్పేసింది. ఎందుకో తెలుసా?" అన్నాడు రాఘవుడు తన ఆగ్రహమంతా ప్రశ్నార్థకంలో చూపిస్తూ.

"వాడికి ఆస్తి లేదని!... ఇంకెందుకూ కాదు! మనిషి అసహ్యంగా ఉన్నాడని కాదు! రెండో పెళ్ళివాడని కాదు! వయస్సెక్కువని కాదు! ఆస్తి లేదని. ఆస్తి ఉంటే తను ఎరగని వాణ్ని పెళ్ళి చేసుకోవటానికి సిద్ధంగా ఉందన్న మాట!"

"అట్లా అనకులే అప్పుడింకే అభ్యంతరం చెప్పేదో!"

"నువ్వట్టా విశాలాక్షిని వెనకేసుకురాకు. ఆ మాటలు చెవులారా విన్న వాణ్ని నేను. ఇటువంటి దానిమీద నిష్కారణంగా ఎంత అభిమానం వృథా చేశానూ!"

"నిన్ను పెళ్ళి చేసుకుంటుందేమో అడిగి చూడూ!"

"నాకా మనిషితో మాట్లాట్టమే అసహ్యంగా ఉంటే పెళ్లి చేసుకోమని అడిగేదీ? నీ పుణ్యమే యిది. నా కటువంటి పెళ్లాం అక్కర్లేదు. అటువంటి దాన్ని చేసుకునేకన్న బతికున్నన్నాళ్లు బ్రహ్మచారిగానన్నా ఉంటాను."

"ఆ మాట మీద ఉండలేవు. బలవంతాన ఉంటే పశ్చాత్తాప పడతావు. నీకు పెళ్ళి చాలా అవసరమల్లేనే కనిపిస్తుంది."

"అంతగా అయితే ఓ పని చేస్తాను. ఎట్టాగూ పెళ్ళంటే లాటరీ అని పెద్దలు చెప్పనే చెబుతున్నారు. పత్రికల్లో వరుడు కావాలని చేసే ప్రకటనల్లో ఏదో ఒకటి వీలయినదిగా చూసి అప్లయి చేసేస్తాను. పీడ వదిలిపోతుంది."

"అది మూడో పాద పద్ధతి."

"నీ పాదాలూ, హస్తాలూ అవతల పెట్టు, నాకు వాటిల్లో విశ్వాసం పోయింది."

"అవి ఒక చెంప రుజువవుతుంటేనే?" అన్నాను. కాని రాఘవుడు నా మాట వినే ఎత్తులో లేడు.

ఇది జరిగిన వారం రోజులకే వాడు నాతో శుభవార్త చెప్పేశాడు. వరుడు కావాలని పత్రికలో కనిపించిన ప్రకటన చూసి దానిక్కాస్త దరఖాస్తు పెట్టి ఊరుకున్నాడు. ఆ ప్రకటన కూడా నాకు చూపించాడు.

"ఈ ప్రకటన సరిగా మా విశాలాక్షి వంటి దానికోసమే పెట్టినట్టున్నది గమనించావా?" అన్నాను.

వాడు గమనించలేదుగాని "మరీ మంచిది, చెప్పుతీసుక్కొట్టినట్టవుతుంది, ఈ సంబంధం నేను చేసుకుంటే!" అన్నాడు.

అంతే వాడు నాకు మళ్ళా మొన్నటి వరకు కనిపించలేదు.

మొన్న కనిపించినప్పుడు – "ఏంరా, రాఘవా? ఏమయింది నీ పెళ్ళి దరఖాస్తు?" అన్నాను.

రాఘవుడు పెదిమ కొరుక్కుని "అది విశాలాక్షి తండ్రి చేసిన ప్రకటనే!" అన్నాడు.

*ముద్రణ: కొడవటిగంటి కుటుంబరావు కథలు, 1960 -63 మధ్య?*

*జయా పబ్లికేషన్స్, విజయవాడ*